# విశ్వకుటుంబంలో ఓ తండ్రి

అనంతరామయ్యని రంగంపూడి గ్రామం నుంచి నగరానికి కదిలించడం నిజానికి మంగపతి సాధించిన ఘన విజయమని చెప్పాలి. కేవలం మైత్రీబంధంవల్లే ఇది సాధ్యపడింది. కలుసుకున్న ముహూర్తం గట్టిదని మంగపతి నమ్మకం.

ఇద్దరిమధ్యా బంధుత్వం లేదు. పోనీ, పరిచయమై పట్టుమని అయిదేళ్లుకూడా కాలేదు. మంగపతి కూతురికి రంగంపూడి సంబంధం చేశారు. రంగంపూడి చిన్నదైనా మంచి ఊరు. అల్లుడు బాగా చదువుకున్నవాడు. అక్కడే లఘుపరిశ్రమ చక్కగా నడుపుతున్నాడు. అమ్మాయిని కాపురానికి దిగబెట్టడానికి ఆ వూరు వెళ్ళినప్పుడు మంగపతికి అనంతరామయ్యతో పరిచయమయింది. అది గాఢమైత్రిగా మారింది.

ఆ వూరిమీద అనంతరామయ్యకున్న అభిమానం మంగపతిని ముగ్ధుడ్ని చేసింది. మంగపతి దృష్టిలో అనంతరామయ్య ఒక ఋషి, ఒక యోగి, ఒక త్యాగమూర్తి. తనకు అలాంటి పెద్ద పెద్ద మాటలు తగిలించవద్దని అనంతరామయ్య వినమ్రంగా వేడుకున్నాడు. మంగపతికి ఆయనమీద గౌరవాదరాలు ఎన్నోరెట్లు పెరిగాయి.

అనంతరామయ్యతో మాట్లాడుతుంటే ఏదో కొత్త అనుభూతి కలుగుతుంది. ఆయన ఆలోచనా ధోరణే వేరు. ఆగామికాలాన్ని దర్శిస్తున్నట్లుంది. ఈ శతాబ్దం వచ్చే శతాబ్దంతో మాట్లాడుతున్నట్లు వుంటుంది. భవిష్యత్తుల్లోకి దూసుకుపోయే దృక్పథం. ఆయన వయస్సుకు భిన్నమైన నిస్వార్థచింతన. తనను గురించిన ఆలోచనకే తావుండదు. పరాకాష్ఠ చేరుకున్న శాంత స్వభావం ఆయనది. సహనం హిమనగంతో పోటీ పడుతుంది.

చిన్న పెంకుటిల్లు. ముందు పూలచెట్లు పూజకు పనికివచ్చే పూలు అందిస్తాయి. వాటిని ప్రేమతో పెంచుతాడు. ప్రభుత్వ వ్యవసాయశాఖలో పనిచేసి పదవీవిరమణ చేశాడు. చెట్ల పెంపకంగురించీ, పొలంపనులగురించీ క్షుణ్ణంగా తెలిసినవాడు. ఊళ్లోవున్న రైతులకు మార్గదర్శిగా వారికి ఎప్పుడే సలహా కావాలన్నా ఇచ్చి, వారి పంటలు ఇబ్బడిముబ్బడి అయ్యేందుకు తోడ్పడుతుంటాడు. వారందరికీ అనంతరామయ్య పెద్దదిక్కు.

సర్కారిస్తున్న పింఛను ఆయన అవసరాలకు సరిపోతుంది. అంతో యింతో మిగులుతుంది కూడా. తరచు గుప్తదానాలు చేస్తుంటాడు. ఇంకా కొంత మొత్తం మిగిలితే బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేస్తాడు. ఖర్చు తక్కువ. భార్య మరణించి

చాలా కాలమయింది. ఒక్కడే కొడుకు. స్థిరాస్తి ఆ ఒక్క పెంకుటిల్లే. ఇదివరకు పొలం వుండేది. ఉద్యోగంలో నిజాయితీకి మారుపేరుగా నిలిచిన అనంతరామయ్య తన కొడుకు తెలివితేటలతో చదువులో పైకి రావడం వల్ల ఎలాంటి సంకోచం లేకుండా ఉన్న కాస్త పొలం అమ్మి పెద్ద డాక్టర్ని చేశాడు. విదేశాలకు పంపాడు.

ఎప్పుడైనా మంగపతి ఈ ప్రస్తావన తెస్తే అనంతరామయ్య కళ్లలో వేయిపున్నముల చల్లనికాంతులు విరబూస్తాయి. గుండె ఆనందార్ణవమై గొంతు రసార్ద్రంతో పలుకుతుంది. "అవునయ్యా మంగపతీ! నా కొడుకు గొప్ప డాక్టరని ఆనందంతో చెప్పుకుంటా, గర్వంగా ప్రకటించుకుంటా. అప్పుడు నాకు కలిగే ఆనందం వంద ఎకరాల మాగాణి పొలం ఇవ్వలేదు. లక్షల రూపాయలు విలువ చేసే ఆస్తి ఇవ్వలేదు. నా బిడ్డ డాక్టరనే అనుభూతి జీవితాంతం ఉంటుంది. పొలం పోయిందని నేనెన్నడూ అనుకోలేదు. ఖర్చయిందనే ఆలోచన నా మనస్సులో ఎప్పుడూ మెదలలేదు. నాలాగే చేసిన ఎవరైనా అలాంటి ఆలోచన పెట్టుకుంటే వెంటనే ఆ ఆలోచన వదులుకోమని చెబుతా. నేను ఒక డాక్టరికి తండ్రిననే సంతోషం ప్రతి నరంలోనూ పాకుతుంది మంగపతీ! ఇంతకన్నా అదృష్టం ఇంకేముంటుందయ్యా ఈ జన్మకి? 'పుత్రోయత్ర నిర్వృతిః' ఒప్పుకోను. కొడుకువల్ల విశ్రాంతి కాదు. ఆనందం లభించాలి."

కొడుకు విదేశాలలో వుండడం గురించి అడిగితే అనంతరామయ్య ఇచ్చే సమాధానం అసాధారణంగా ఉంటుంది. "నిజమే మంగపతీ! మావాడు మామూలు డాక్టరు కాదు. గొప్ప కార్డియాలజిస్టయ్యా! అంటే, గుండెజబ్బులు నయంచేసే వైద్యుడన్న మాట. రంగంపూడిలోనో, పక్కనున్న ఏదైనా నగరంలోనో వుండమంటావా? అమెరికాలో చదివి ఎన్నెన్నో డిగ్రీలు సంపాదించాడయ్యా! వాడి డిగ్రీలు రాస్తే ఒక లైను సరిపోదంటే నమ్ము. ఆ డిగ్రీలన్నీ నావేనయ్యా! కాదంటావా? నా కొడుకు ఉన్నతి నా ఉన్నతే మంగపతీ! నా దృష్టిలో మావాడు ప్రపంచ పౌరుడు. విశ్వమంతా వాడి కుటుంబమే. ఎక్కడ ఏ ప్రదేశంలో వాడిసేవలు అవసరమైతే అక్కడికివెళ్లి వ్యాధిగ్రస్తుల్ని ఆదుకోవాలి. ఎంతమంది ప్రాణాలు కాపాడుతున్నాడో తలచుకుంటే గర్వంగా వుండదా నువ్వేచెప్పు. వాడికి జరిగే సత్కారం నాకు జరిగినట్లే. మావాడికి ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజీలో యూరప్ కార్డియాలజీ సొసైటీ పాశ్చర్స్ పురస్కారం ఇచ్చినప్పుడు అదినాకే వచ్చినంతగా సంబరపడ్డాను."

ఇలా సాగుతుంది ఆయన సంభాషణ.

కొడుకు అమెరికా యువతిని పెళ్లిచేసుకోవడం గురించి చెబుతూ అనంతరామయ్య అన్వయించుకున్న తీరు మంగపతిని ఆశ్చర్యపరిచింది.

"నేను చెప్పానుకదయ్యా! వాడిది విశ్వకుటుంబం. నన్నడిగితే మావాడు చాలా మంచిపని చేశాడంటాను. తన అభిరుచికి తగినట్లు వివాహం చేసుకున్నాడు. పెళ్లి, దంపతులు కాబోయే వాళ్లు నిర్ణయించుకోవాలయ్యా మంగపతీ! ఈ సంగతి తెలియక

మన దేశంలో మగపిల్లల్నీ, ఆడపిల్లల్నీ మొహమాటంలో పడేస్తుంటాం. మా కోడలు కూడా కార్డియాలజిస్టేనయ్యా. ఇద్దరూ కలిసి కష్టాలలో వున్నవాళ్ళని ఆదుకుంటున్నారు. పెళ్ళిచేసుకున్న సంగతి నాకు రాశాడయ్యా. మా కోడలు కూడా నాలుగు వాక్యాలు రాసింది. అవి చాలు నా కోడలు ఎంత ఉత్తమురాలో చెప్పడానికి. అంత బిజీగా వున్నా వీలుచూసుకుని ఉత్తరం రాశారయ్యా! ఆ టైంలో నలుగురైదుగురు పేషంట్లని చూడొచ్చు తెలుసా? ఎంతో సంబరపడ్డాను. ఎప్పుడు ఏ దేశం వెళ్లవలసి వస్తుందో ముందుగా చెప్పలేమని రాశారు. ఇండియా వస్తే తప్పక రంగంపూడి వచ్చి నన్ను చూస్తామని అన్నారయ్యా! వాళ్ళు వచ్చినంత ఆనందంగా వుంటుందయ్యా. ఎప్పుడే దేశంనుంచి జరూరు పిలుపు వస్తుందో మానవ సేవే మాధవ సేవ అన్నారు పెద్దలు. నేను పెద్దవాడినయ్యాను. అయినా నాకిప్పుడు ఎలాంటి కోరికలు లేవంటేనమ్ము మంగపతీ! ఇల్లు మావాడి పేర వీలునామా రాసిన సంగతి నీకు తెలుసు. ఎఫ్.డి.లు కూడా వాడికే దక్కుతాయి. మా యింటావిడ నగలున్నాయి లాకర్లో పెట్టాను. అవి నా కోడలికి దక్కాలని వీలునామాలో స్పష్టంగా చెప్పానయ్యా! దేవుడు ఎప్పుడూ వాళ్లిద్దర్నీ చల్లగా చూడాలి. దేవుడి దయవుంటే వెళ్లిపోయేలోగా ఒకసారి వాళ్లిద్దర్నీ చూస్తాను. లేకపోయినా చింతలేదయ్యా మంగపతీ! ఇద్దరూ ప్రాణదాతలే. నా అంత అదృష్టవంతులు చాలా తక్కువ."

అనంతరామయ్య ఆలోచనల శిఖరాల ఎత్తులు మంగపతికి అందేవికావు. ఆయన హృదయ వైశాల్యం ఊహకు చిక్కేదికాదు.

ఇల్లే ఆశ్రమంగా మార్చుకుని జీవనం సాగిస్తున్న ఒక మహావ్యక్తిగా తోస్తాడు అనంతరామయ్య మంగపతికి. స్వయంపాకంతో ఒక పూటే ఆయన భోజనం. అతి సాత్వికంగా ఉండే ఆహారం అనంతరామయ్యది. తమతో వుండమని మంగపతి కుమార్తె ఎన్నోసార్లు ప్రాధేయపడింది. మంగపతి కన్నీటితో బ్రతిమిలాడు. 'నీలాంటి మంచిమనిషి నాకు మిత్రుడైనందుకు నా జన్మ ధన్యం మంగపతీ! అల్లుడూ అమ్మాయీ ఎప్పటికప్పుడు నా సంగతి చూస్తూనేవున్నారు కదయ్యా! అమ్మాయి ఇల్లు రెండడుగులేస్తే వచ్చేస్తుంది. నువ్వు మనసులో అదేం పెట్టుకోవద్దు. నిబ్బరంగా వుండు' అని అనునయించేవాడు.

తన పనులు తాను చేసుకోగలిగే స్తోమతను ఇచ్చినందుకు భగవంతుడికి రోజూ కృతజ్ఞతలు సమర్పిస్తుంటాడు. అప్పుడప్పుడు గుండెదడ అనిపిస్తున్నా అది వయస్సువల్లేనని అనుకుని ఎవరికీ చెప్పేవాడు కాదు.

ఒకసారి మంగపతికూతురు వచ్చిచూస్తే అనంతరామయ్య పడుకున్నాడు. ఆ సమయంలో మామూలుగా పూజచేసుకునే వాడాయన. "కొంచెం నలతగా వుంది తల్లీ! కాసేపు విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతుందమ్మా!" అని సర్దిచెప్పాడు. ఆ పూట ఆమె భోజనం తెచ్చి పెట్టింది. తండ్రికి ఆ సంగతి రాసింది.

ఒకసారి పెద్ద డాక్టరుతో పరీక్షచేయించడం మంచిదనుకున్నాడు మంగపతి. బాగా తెలిసిన పెద్ద డాక్టర్ని కారులో తనతోపాటు రంగంపూడి తీసుకువెళ్లాడు.

అనంతరామయ్య 'ఎందుకయ్యా మంగపతీ! ఇంతశ్రమ? నాకేం నిక్షేపంగా వున్నాగా!' అని మంగపతితో అన్నాడు.

డాక్టరు పరీక్ష చేశాడు. 'మీరేం ఆందోళన చెందనవసరం లేదు' అన్నాడు అనంతరామయ్యతో

'డాక్టరుగారూ! నాకు ఎలాంటి ఆందోళనా లేదు. ఇదుగో, నా ప్రాణమిత్రుడు మంగపతి మాటకాదనలేక మీచేత పరీక్ష చేయించుకుంటున్నాను' అని నవ్వుతూ చెప్పాడు.

'అయితే అదృష్టవంతులు. మీ గురించి మంగపతిగారు అన్ని విషయాలు చెప్పారు. గుండె కొట్టుకోవడంలో కొంచెం మార్పు కనిపిస్తోంది. దాన్ని ఎక్స్‌ట్రాసిస్టోల్ అంటారు. అంటే, గుండెలయ ఒక్కొక్కప్పుడు మారుతూ వుంటుంది. మందులిస్తాను. వాడండి. ఇబ్బందేమీవుండదు' అని వివరించాడు డాక్టరు.

డాక్టరు ఇవతలికి వచ్చిన తర్వాత మంగపతీ, అతనికుమార్తె, అల్లుడూ ఆందోళనతో జబ్బు గురించి అడిగారు. 'ప్రస్తుతానికి చిక్కేమిలేదు. మందుల్తో నయం కావచ్చు. అయితే స్పృహతప్పిపోవడం వంటివి తోడైతే మాత్రం వెంటనే నగరానికి తీసుకువచ్చి చికిత్స చేయించవలసి ఉంటుంది' అని చెప్పాడు డాక్టరు.

మంగపతి ఇది హెచ్చరికగా భావించాడు. అనంతరామయ్యని వుండేందుకు తనతో నగరానికి వచ్చేయమన్నాడు. ఒప్పుకోలేదు. కంటికి రెప్పలా అనంతరామయ్యని చూస్తుండమని కుమార్తెతో చెప్పి, డాక్టరుతో తిరుగు ప్రయాణమయ్యాడు మంగపతి.

అనంతరామయ్య ఆరోగ్యం గురించి అల్లుడు ఉత్తరాలు రాస్తున్నాడు. మంగపతికి అవి ఊరట కలిగిస్తున్నాయి.

ఒకరోజు మధ్యాహ్నం అనంతరామయ్యకి పదినిమిషాలపాటు స్పృహతప్పిందని అల్లుడు మంగపతికి టెలిగ్రాం ఇచ్చాడు.

మంగపతి చాలా కలవరపడ్డాడు. ఆ ఉదయమే పేపర్లో వచ్చిన ఒక వార్త చదివి అనంతరామయ్య సంగతి ఆలోచిస్తుండగా ఈ టెలిగ్రాం రావడం వింతగా తోచింది. జర్మనీ దేశం నుంచి కార్డియాలజిస్టుల బృందం మర్నాడు జెమినీ హాస్పిటల్‌కు వస్తోందన్ని ఆ వార్త తెలియచేస్తోంది.

వెంటనే మంగపతి జెమినీ హాస్పిటల్‌కి వెళ్ళి, అనంతరామయ్య పేరు రిజిస్టరు చేయించాడు.

కారు మాట్లాడుకుని రంగంపూడి బయలుదేరాడు. ముందు అనంతరామయ్య సమ్మతించలేదు. మంగపతి పట్టుపట్టాడు. బ్రతిమాలాడు. చివరకు అనంతరామయ్య ఒప్పుకున్నాడు.

నగరం చేరగానే అనంతరామయ్యని జెమినీ హాస్పిటల్‌లో చేర్చారు.

గతాన్ని నెమరువేసుకున్న మంగపతికి మిత్రుడిపట్ల తన కనీస ధర్మాన్ని నెరవేరుస్తున్నాననే తృప్తి కలిగింది.

హాస్పిటల్‌లో రిజిస్టరు చేయించుకున్న కేసుల్ని బృందంలోని డాక్టర్లకి పంచారు. క్యూబికల్‌లో బెడ్‌మీద అనంతరామయ్య ఎలాంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా పడుకున్నాడు. పరీక్షిస్తున్నప్పుడు ఎవరూ వుండకూడదనే నియమం వుంది. అందుచేత మంగపతి ఇవతలవున్న హాలులో ఆత్రుతతో నిరీక్షించక తప్పలేదు.

అనంతరామయ్యను పరీక్షించే డాక్టరుపేరు బయటవున్న పట్టికలో చూశాడు మంగపతి. డా॥ హన్, డా॥ మిసెస్ హన్ అని రాసి వుంది. ఇద్దరు నిపుణులు పరీక్షచేస్తే మరీ ఉత్తమం అని మంగపతి చాలా సంతోషించాడు.

డా॥ హన్, డా॥ (మిసెస్) హన్‌తోపాటు జైమినీ హాస్పిటల్ డాక్టరొకరు క్యూబికల్‌లోకి వెళ్ళాడు.

అనంతరామయ్యని చూడగానే డా॥ హన్ ఆశ్చర్యపోయాడు. ఎదురుగా డా॥ హన్‌ని, డా॥ (మిసెస్) హన్‌నీచూసిన అనంతరామయ్య హృదయం ఆనందంతో ఉవ్వెత్తున పొంగింది. ఆనందోద్వేగాన్ని గుండె భరించలేకపోయింది.

డా॥ హన్‌ని అనంతరామయ్య రెండుచేతులతో ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని నాన్నా మోహన్! ఎన్నాళ్ళకి చూశానయ్యా నా బంగారుతండ్రిని... లక్ష్మీదేవిలాంటి కోడల్నికూడా చూడగలిగానయ్యా! తల్లీ! సంతోషం, మిమ్మల్నిద్దర్నీ చూశాను' అన్నాడు నీరసం ముంచుకొస్తున్నా.

బలం కూడగట్టుకుని ఇద్దరి తలలపైనా చేతులానించి 'గాడ్ బ్లెస్‌యూ' అని దీవించాడు నెమ్మదిగా.

అనంతరామయ్య చేతులు అప్రయత్నంగా జారిపోయాయి.

డా॥ మోహన్ తండ్రి గుండెపైన స్టెతస్కోప్ పెట్టి చూసి భార్యతో 'మై డాడ్ యిీజ్ నో మోర్..... హియీజ్ యాన్ ఎంబాడిమెంట్ ఆఫ్ లవ్ అండ్ శాక్రిఫైస్' అని రుద్ధకంఠంతో చెప్పాడు, పొంగి పొర్లుతున్న కన్నీరుతుడుచుకుంటూ.

ఈ సంగతి విని లోపలికొచ్చిన మంగపతి బావురుమన్నాడు.

('ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక' - *25-12-1996*)